క్లుప్తంగా

సురేఖను కలిసిన బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు



జఫర్‌గఢ్: రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన కొండా సురేఖను మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంచాల ఎల్లయ్య హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సురేఖకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

పరామర్శ



బచ్చన్నపేట: పడమటికేశ్వాపూర్ ఎంపీటీసీ చల్ల సక్కుబాయి గుండెనొప్పుతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. కాగా, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆదివారం ఆమెను పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని మనోధైర్యం కల్పించారు. సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, సర్పంచ్ బాల్‌రెడ్డి ఉన్నారు.

చేయూత



బచ్చన్నపేట: కొన్నె గ్రామానికి చెందిన కురాం మాధవి–బాలయ్య దంపతుల కూతురు దివ్య వివాహానికి సర్పంచ్ వేముల వెంకట్‌గౌడ్ రూ.10వేల ఆర్థికసాయం ఆదివారం అందజేశారు. నాయకులు తాటికొండ నర్సింహాచారి, పిట్టల బాలరాజు, శివకుమార్, బాలరాజు తేలు శ్రీనివాస్, కురాం కనుకయ్య, పసుల సురేష్, రవి, చెక్క కరుణాకర్, ప్రశాంత్, యాట బాలు, రమేష్ పాల్గొన్నారు. అలాగే వివాహానికి బీఆర్‌ఎస్ కొన్నె గ్రామ నాయకుడు కొడూరి శివకుమార్‌గౌడ్ రూ. 5వేల ఆర్థిక అందించారు. జి.రాకేష్, బింగి భరత విజేందర్, మధు, కనుకయ్య ఉన్నారు.

సన్మానం

దేవరుప్పుల: తెలుగు సాహిత్యంలో విశిష్ట సేవలందిస్తున్న దేవరుప్పులకు చెందిన అంకాల సోమన్నకు తెలంగాణ సాహిత్య అకాడమీ ప్రథమ అధ్యక్షుడు నందిని సిద్దారెడ్డిచే ఘన సన్మానం జరిగింది. ఆదివారం పాలకుర్తిలో సోమనాథ కళాపీఠం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కవి సమ్మేళనంలో డాక్టర్ లింగపల్లి రామచంద్రం రచించిన జిల్లా సాహిత్య చరిత్ర గ్రంథావిష్కరణలో పలువురికి సత్కారం లభించింది.

రామరాజుపల్లిలో సంబురాలు



దేవరుప్పుల: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం ప్రవేశపెట్టడంతో రామరాజుపల్లి ప్రజలు సంబురాలు నిర్వహించి తమ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఉదయం గ్రామానికి ఆర్టీసీ బస్సు రాగానే తోరణాలు కట్టి సంబురాల్లో సీఎం రేవంత్‌రెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమలో కాంగ్రెస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు కాడబోయిన గణేష్, పార్టీ గ్రామ అధ్యక్షుడు పురుషోత్తం కృష్ణ, ఉప్పునూతుల సురేష్, బేతి విష్ణు దాసగాని రవి, బోయిని రాజు, బోయిని భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం కోసం దివ్యాంగుడి వినతి

పాలకుర్తి: పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన తనకు ఉద్యోగం ఇప్పించాలని మండల కేంద్రానికి చెందిన దివ్యాంగుడు నాగరాజు కోరాడు. ఈ మేరకు పాలకుర్తిలో ఆదివారం నిర్వహించిన విజయోత్సవ సభలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీ రెడ్డికి విన్నవించాడు. వెంటనే ఎమ్మెల్యే స్పందించి ఉద్యోగం వచ్చేలా సహకరిస్తానని హామీ ఇచ్చారు.

నేడు మండల సమావేశం

చిల్పూరు: మండల సర్వసభ్య సమావేశాన్ని నేడు (సోమవారం) మండల పరిషత్ హాల్‌లో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పులుగు వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, సభ్యులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

భవిష్యత్‌కు 'సాక్షి' ముందడుగు

- జిల్లా స్థాయి 'సాక్షి' స్పెల్ బీ, మ్యాథ్స్‌బీ పరీక్షకు విశేష స్పందన
- విద్యార్థుల ప్రతిభాపాటవాలకు గీటురాయి
- అర్హత ఆధారంగా హైదరాబాద్ రీజినల్ పోటీలకు ఎంపిక



ఏకశిల పబ్లిక్ స్కూల్‌లో మ్యాథ్స్ బీ, స్పెల్‌బీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

జనగామ: పోటీ ప్రపంచంలో ఎవరికి వారే దూసుకు పోవడం తప్ప.. నువ్వా నేనా అనే పరిస్థితి లేదు. సాంకేతికత పరిజ్ఞానం.. తెలివి తేటలు.. ఈ రెండూ ఉంటే చదువులో కాసింత వెనకబడి పోయినా జీవితంలో ఎంచక్కా రాణించవచ్చు. ఇవి కావాలంటే మొక్క నుంచే నీరు పోసి పెంచాలి. ఇందుకు 'సాక్షి' మీడియా ఆ బాధ్యతను తీసుకుంది. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు భవిష్యత్ పోటీ పరీక్షల్లో ఎటువంటి వణుకు, బెనుకు లేకుండా పాల్గొని సక్సెస్ సాధించేందుకు జిల్లాల వారీగా ఇంగ్లిష్, గణితంలో పిల్లల ప్రతిభా పాతవాలను వెలికి తీసేందుకు ఎంట్రన్స్ పరీక్షలు నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రం హైదరాబాద్ రోడ్డులోని ఏకశిల పబ్లిక్స్ స్కూల్‌లో ఆదివారం 'సాక్షి' ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో స్పెల్‌బీ, మ్యాథ్స్‌బీ పరీక్షలు నిర్వహించింది. జిల్లాలోని ఏకశిల పబ్లిక్ స్కూల్ (జనగామ), యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులోని ఏకశిల పబ్లిక్స్ స్కూల్, గీతాంజలి హైస్కూల్ (జనగామ), శ్రీ అరబిందో హైస్కూల్ (జనగామ), ఒయాసిస్ హైస్కూల్ (స్టేషన్‌ఘన్‌పూర్), పీవీఆర్ హైస్కూల్ (వనపర్తి, లింగాల ఘనపురం), సాన్ మారియా హైస్కూల్ (జనగామ) పాఠశాలలకు చెందిన సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొని, ప్రతిభను చాటుకున్నారు. విద్యార్థినీవిద్యార్థులు ప్రాథమిక స్థాయిలో ఎవరికి వారు ప్రతిభ కనపరిచి రీజనల్ స్థాయిలో అర్హత కనబరిచే విధంగా పోటీపడ్డారు. ఏకశిల పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ చిర్ర ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తరుచూ పోటీ పరీక్షల్లో పాల్గొనడంతో భవిష్యత్‌లో పాల్గొనే ఎంట్రెన్స్‌లకు శుభసూచికగా అవసరపడుతుందన్నారు. ఐఏఎస్, ఐపీఎస్‌తో పాటు కేంద్ర, రాష్ట్ర స్థాయిలో జరిగే అన్ని కేటగిరీల్లో నిర్వహించే పోటీ పరీక్షల్లో సక్సెస్ ఎలా సాధించాలనే అవగాహన కలుగుతుందని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమలకు ప్రజెంటింగ్ స్పాన్సర్‌గా డ్యూక్స్ వ్యాఫి, అసోసియేట్ స్పాన్సర్‌గా ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ వ్యవహరిస్తుంది. ఇలాంటి కార్యక్రమాలు ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులు సైతం పాలుపంచుకోవాలని భావిస్తే, ఫోన్-95055 14424ను సంప్రదించాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఈవెంట్స్ మేనేజర్ ఎన్. సుమన్ గుప్తా, జిల్లా సాక్షి ఏడీవీటీ ఆఫీసర్ నేతి ఉపేందర్, సాక్షి బృందం పాల్గొంది. కాగా, ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను హైదరాబాద్ రీజినల్ స్థాయిలో నిర్వహించే పోటీ పరీక్షలకు ఎంపిక చేస్తారు.

SAKSHI SPELL Bee 2023-24

SAKSHI MATH BEE 2023-24

SAKSHI | సాక్షి | సాక్షి SAKSHI TV | SAKSHI DIGITAL | MEDIA GROUP

ప్రతీ అంశంపై పట్టు లభిస్తుంది



సాక్షి నిర్వహించిన పోటీ పరీక్షలో పాల్గొనడం వల్ల అనేక కొత్త విషయాలను నేర్చుకున్నా. ప్రతీ అంశం మీద మంచి పట్టు లభించింది. భవిష్యత్‌లో ఉన్నత చదువులు, ఉద్యోగాల కోసం రాసే పోటీ పరీక్షలకు చక్కగా ఉపయోగపడుతుంది.

– బి.మోక్షిత్, 6వ తరగతి, గీతాంజలి హైస్కూల్

టైమ్ సేవ్ చేసుకోవడం తెలిసింది



సాక్షి మ్యాథ్స్‌బీ, స్పెల్‌బీ పరీక్ష రాయడంతో భవిష్యత్‌లో ఎంట్రన్స్ రాసేటప్పుడు సమయం ఎలా సేవ్ చేసుకోవాలనే దానిపై అవగాహన వచ్చింది. ఈ స్ఫూర్తితో తక్కువ సమయంలో ఎక్కువ సమాధానాలు ఎలా రాయలో ట్రిక్స్ తెలుసుకున్నా.

– అక్షర, 7వ తరగతి, పీవీఆర్ హైస్కూల్, వనపర్తి

విజ్ఞానం పెరుగుతుంది



సాక్షి మ్యాథ్స్‌బీ పరీక్షతో విజ్ఞానం పెరుగుతుంది. పోటీ పరీక్షల్లో ఎలా పాల్గొనాలనే విషయం హైస్కూల్ స్థాయిలోనే అవగాహన కలుగుతుంది. ఇలాంటి పరీక్షలు సాక్షి ఎప్పుడూ నిర్వహించాలి.

– స్నేహప్రియ, 9వ తరగతి, శ్రీఅరబిందో హైస్కూల్

మ్యాథ్స్‌పై పట్టు వచ్చింది



పోటీ పరీక్షల్లో పాల్గొనడం వల్ల మాలాంటి విద్యార్థులకు గణితంపై భయం పోయి మంచి పట్టు వస్తుంది. సాక్షి ఎప్పుడు ఎక్కడ ఎంట్రన్స్ నిర్వహించినా నేను పాల్గొంటాను. పరీక్ష ప్రశ్నాపత్రం సైతం టఫ్‌గా ఇచ్చారు.

– శ్రీదర్శిని రాజ్, 7వ తరగతి, ఒయాసిస్ హైస్కూల్, స్టేషన్‌ఘన్‌పూర్

ప్రాథమిక స్థాయిలో పరీక్ష రాయడం సంతోషం



సాక్షి మ్యాథ్స్‌బీ ప్రాథమిక స్థాయిలో పరీక్ష రాయడం సంతోషంగా ఉంది. ఈ పరీక్ష కోసం బాగా కష్టపడి చదివాను. ఇలాంటి పోటీ పరీక్షలు సాక్షి మరిన్ని నిర్వహించి మాలో ఉన్న భయాన్ని పోగొట్టాలి.

– పి.భవితశ్రీ, 4వ తరగతి, ఏకశిల పబ్లిక్ స్కూల్

ధైర్యం వచ్చింది



సాక్షి నిర్వహించిన స్పెల్‌బీ, మాథ్స్‌బీ పోటీ పరీక్షలు రాయడంతో నాలో ధైర్యం పెరిగింది. చిన్ననాటి నుంచి ఇటువంటి పోటీ పరీక్షల్లో పాల్గొనే అవకాశం సాక్షి కల్పించింది. భవిష్యత్‌లో ఈ పరీక్షలు ఎంతో ఉపయోగపడతాయి.

– డి.అభిషేక్, ఏకశిల పబ్లిక్ స్కూల్, ఆలేరు

భయం తొలగిపోతుంది



సాక్షి ఆధ్వర్యంలో పరీక్ష రాయాలని మా టీచర్ చెప్పగానే మొదట్లో భయమేసింది. పరీక్ష మెటీరియల్ ఇచ్చి, ప్రిపరేషన్ కావాలని చెప్పి ధైర్యం చెప్పారు. పరీక్షకు హాజరై, ప్రశ్నా పత్రం ఇచ్చిన రెండు నిమిషాల్లో నాలో చాలా ధైర్యం వచ్చింది. చకచకా జవాబులు రాసిన. నాలో ఉన్న భయాన్ని సాక్షి పోగొట్టింది.

– టి.సుదీక్ష, 7వ తరగతి, గీతాంజలి హైస్కూల్, జనగామ

భవిష్యత్‌కు ఉపయోగకరం



సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన ఇలాంటి పరీక్షలు రాయడం వలన తమ భవిష్యత్ తరగతుల్లో వచ్చే గణిత విద్యకు ఉపయోగకరంగా ఉంటుంది. అలాగే ఇంగ్లిష్‌లో మరింత పట్టు సాధించే విధంగా తమలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది.

– కె.విశాల్, 8వ తరగతి, ఏకశిల పబ్లిక్ స్కూల్, జనగామ

బెల్ట్ గ్రేడింగ్.. ఆత్మరక్షణకు దోహదం



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో అతిథులు

జనగామ: విద్యార్థులు బెల్ట్ గ్రేడింగ్ నేర్చుకుంటే వారి ఆత్మరక్షణకు దోహదపడుతుందని కల్నల్ భిక్షపతి, గంటా రవీందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని నారాయణ హైస్కూల్‌లో ఆదివారం నిర్వహించిన బెల్ట్ గ్రేడింగ్ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. బెల్ట్ గ్రేడింగ్‌ను చెడుకు వినియోగించకూదని అన్నారు. విద్యార్థులు భవిష్యత్‌లో ఆర్మీ, ఇతర రంగాల్లో చేరి దేశ భవిష్యత్‌ను కాపాడాలని కోరారు. గ్రేడింగ్ నేర్చుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు, బెల్టులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల డీజీఎం రిజ్వాన, ఆర్‌ఐ వేణుకుమార ప్రిన్సిపాల్ రిగ్నం బిస్వా, ఏఓ బీఎస్‌చారి, సీనియర్ మాస్టర్ విష్ణువర్ధన్, రావెల రవి, సీఐ నాగమల్లు, ఎండీ సలీమ్ పాషా, మాస్టర్ గుగ్గిళ్ల దేవేందర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నాయిని రాజేందర్‌రెడ్డికి ఘనస్వాగతం



నాయినిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం మొదటిసారిగా హైదరాబాద్ నుంచి హనుమకొండకు వెళ్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులకు ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో పార్టీ జిల్లా నాయకుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొలిపాక సతీష్, సునీత దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం ఘన స్వాగతం పలికారు. స్థానిక బస్టాండ్ వద్ద పార్టీ శ్రేణులు పూలమాల, శాలువాతో సన్మానించారు. జెడ్పీటీసీ మారపాక రవి, రఘునాథపల్లి ఎంపీపీ మేకల వరలక్ష్మి, నాయకులు చింత ఎల్లయ్య, గుర్రం యాదగిరి, మేకల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



అంజయ్య(ఫైల్)

బచ్చన్నపేట: ఎదురెదురుగా వస్తున్న వాహనాలు ఢీకొన్న రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. గ్రామస్తులు, ఎస్సై కంకల సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బోడకుంటి అంజయ్య(65) హైదరాబాద్‌లో నివాసముంటున్నాడు. అక్కడ రైస్ మిల్లులో గుమస్తాగా పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. గత నెల 30వ తేదీన శాసనసభ ఎన్నికల్లో ఓటు వేయడానికి స్వగ్రామం బచ్చన్నపేటకు వచ్చాడు. తిరిగి ఈనెల 6న అంజయ్య ద్విచక్ర వాహనంపై హైదరాబాద్ వెళ్తుండగా గోపాల్‌నగర్ చౌరస్తా సమీపంలో అదే గ్రామానికి చెందిన గొల్లపెల్లి మల్లారెడ్డి పోచన్నపేట నుంచి ఎదురుగా ట్రాక్టర్ ఇంజన్‌కు వెనుకాల ఉన్న నాగళ్లకు కేజీవీల్స్ వేసుకొని వస్తుండగా అదుపు తప్పి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ఘటనలో అంజయ్య తలకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు జనగామ తీసుకెళ్లి వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. ఘటనా స్థలం వద్దకు ఎస్సై సతీష్ వెళ్లి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, బాధిత కుటుంబ సభ్యులను శాసనమండలి మాజీ చీఫ్ విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు పరామర్శించారు.

ఆలయ నిర్మాణానికి సహకరించండి



సమావేశంలో పాల్గొన్న సర్పంచ్, గ్రామస్తులు

బచ్చన్నపేట: మండలంలోని బండనాగారంలో నిర్మిస్తున్న దుర్గామాత ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలని సర్పంచ్ శివరాత్రి కవితరాజనర్సులు కోరారు. ఆదివారం గ్రామంలోని దుర్గామాత ఆలయం వద్ద గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ 2024 మార్చి 2వ తేదీన దుర్గామాతకు భోనాలు, 3న గ్రామస్తుల సామూహిక వన భోజనాల కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు ఏకగ్రీవ తీర్మానం చేసుకున్నట్లు తెలిపారు. మార్చి 2లోపు ఆలయ నిర్మాణ అసంపూర్తి పనులు పూర్తి చేయాలని సూచించారు. పండుగకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బత్తిని రాజలింగం, నాయకులు కొప్పురపు శ్రీనివాస్‌రెడ్డి. రాజురెడ్డి, జంగిలి ఆంజనేయులు, స్వామి, గూడెముల్ల ప్రభాకర్, రాపెల్లి చక్రపాణి, సవాదు మల్లారెడ్డి, ఉమాకర్, శ్రీనివాస్ గ్రామస్తులు పాల్గొన్నారు.

సహకార సంఘాలు ఆర్థికాభివృద్ధి చెందాలి



గుర్తింపు కార్డులు అందజేస్తున్న భిక్షపతి

లింగాల ఘణపురం: మత్స్యశాఖ సహకార సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ నాయకుడు డాక్టర్ కల్నల్ భిక్షపతి అన్నారు. మండలంలోని నాగారంలో మత్స్య సహకార సొసైటీ సభ్యులకు భిక్షపతి చేతుల మీదుగా గుర్తింపు కార్డులు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్‌లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా ఉద్యమించాలన్నారు. రాజకీయంగా ఆర్థికంగా ఎదగాల్సిన అవసరం ఉందని చెప్పారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్‌లు తమ సత్తా చాటాలన్నారు. గ్రామ వార్డు స్థాయి నుంచి సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కట్ల సదానందం, జిల్లా డైరెక్టర్ పి.రాజు, మండల అధ్యక్షుడు ఎన్.గోపాల్, దండు కృష్ణమూర్తి, దండు రవి పాల్గొన్నారు.

తిరుపతికి భజనమండలి సభ్యులు



హరినామ సంకీర్తనలో పాల్గొన్న గోవర్ధనగిరి వాసులు

రఘునాథపల్లి: ఏపీలోని తిరుమల తిరుపతి దేవస్థానంలో నిర్వహించిన హరినామ సంకీర్తనకు మండలంలోని గోవర్ధనగిరి గ్రామానికి చెందిన బాలాంజనేయ భజనమండలి సభ్యులకు అవకాశం దక్కింది. అందులో భాగంగా ఆదివారం హరినామ సంకీర్తనలో పాల్గొన్న సభ్యులు అఖండ హరినామ కీర్తనలు చేసి భక్తులను పులకింపజేశారు. పాల్గొన్న వారిలో అధ్యక్షుడు గొడుగు రాజు, తపాలవాయిద్యకారుడు కుసుంబ మధు, దొనికెళ్ల రమేష్, ఫోటో గ్రాఫర్ ముసిపట్ల నాగమౌళి, ఐలయ్య, రామ్‌శంకర్, ఎర్రం హరిశంకర్, నాగరాజు, మల్లేశం, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



స్టేషన్‌ఘన్‌పూర్: సమ్మేళనంలో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు



సమ్మేళనంలో పాలకుర్తి జెడ్పీహెచ్‌ఎస్ పూర్వ విద్యార్థులు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండ జెడ్పీఎస్‌ఎస్‌లో 1991–92 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని డివిజన్ కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. 32 సంవత్సరాల క్రితం కలిసి చదువుకున్న బాల్య స్నేహితులు ఒక్కచోట కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పూర్వ విద్యార్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆద్యంతం ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి వాకులమాల రాఘవాచార్య దంపతులు మహిళలకు కుంకుమ భరిణెలు, పురుషులకు వేంకటేశ్వరస్వామి లోగో ఉన్న కీ చైన్లు ఉచితంగా అందించారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు సౌమిత్రి ధర్మచార్యులు, పద్మజ, శంకర్‌లింగం, కిష్టయ్య, సుదర్శన్‌లను శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ 32 ఏళ్ల అనంతరం స్నేహితులంతా పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేయడం, ఒకే వేదికపై కలుసుకోవడం, తమకు సన్మానం చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమ నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు.



దేవరుప్పుల: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

పాలకుర్తి జెడ్పీహెచ్‌ఎస్‌లో..

పాలకుర్తి: పాలకుర్తి జెడ్పీహెచ్‌ఎస్ 2000–2001 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన నాటి ఉపాధ్యాయులను సన్మానించారు.

దేవరుప్పుల మండల కేంద్రంలో..

దేవరుప్పుల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో 2000–01 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించుకున్నారు. మండల కేంద్రంలోని భార్గవి గార్డెన్స్‌లో ఆత్మీయత సమ్మేళనంలో మిత్రులు కలుసుకొని తమ చిన్ననాటి మధుర స్మృతులను తలచుకున్నారు. అనంతరం విద్యాబోధన చేసిన దామోదర్ రెడ్డి, రమేష్ శర్మ,చంద్రారెడ్డి, యాదవ రెడ్డి, నభీ సాహెబ్, మల్లికార్జున్,యాదగిరి, నర్సింహచారి, రామస్వామి, శరబందం, సోమారెడ్డిలకు జ్ఞాపికలను ఇచ్చి ఘనంగా సన్మానించారు. విద్యార్థులు శ్రీపాల్, ప్రశాంత్, అజయ్, రవీందర్‌రెడ్డి, ఎల్లేష్ ,సుమన్ ,యాకూబ్, నర్సింహ, రమేష్, యాకన్న ,మధు, పరుశురాములు, నలీనీకాంత్, సంధ్య ,రజని, సైదమ్మ, అన్నపూర్ణ, శ్రీలత, సరిత, రజిత, అనంతలక్ష్మి, ప్రేమలత, సునీత పాల్గొన్నారు.

ఆర్థికసాయం



బచ్చన్నపేట: మండలంలోని కొన్నెలో మృతి చెందిన మల్ల మల్లమ్మ కుటుంబ సభ్యులను బీఆర్‌ఎస్ నాయకుడు కోడూరి శివకుమార్‌గౌడ్ పరామర్శించి అంత్యక్రియలకు రూ.5 వేల ఆర్థికసాయం ఆదివారం అందజేశారు. ఆయన వెంట నాయకులు మల్ల సిద్దిరాములు, ఊలయ్య, కర్రె నర్సమ్మ తదితరులు ఉన్నారు.

మహాలక్ష్మి, ఆరోగ్యశ్రీ పథకాలు ప్రారంభం



ఆరోగ్యశ్రీ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డి



మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

ఎమ్మెల్యేగా గెలుపొందిన అనంతరం యశస్వినిరెడ్డి.. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డితో కలిసి ఆదివారం పాలకుర్తికి వచ్చారు. ఆమెకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాలు మహాలక్ష్మి, ఆరోగ్యశ్రీని ఆమె ప్రారంభించారు.



అభివాదం చేస్తున్న యశస్వినిరెడ్డి, ఝాన్సీరెడ్డి